



ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - సీతంపేట

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి సోమవారం స్థానిక ఐటిడిఎలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రాజెక్టు ఆఫీసరు సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మార్చి 8 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అప్పటివరకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడదన్నారు. కావున గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవడానికి స్థానిక ఐటిడిఎకు ఎవరూ రావద్దని పిఒ కోరారు.

ఆశలు తీరేనా?

రైల్వే ప్రణాళికలు పట్టాలెక్కేనా? ● సాగునీటి ప్రాజెక్టులకు సహకరిస్తారా?



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు జిల్లా అభివృద్ధి ఎండమావిగా మారిపోయింది. గతంలో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అడుగడుగునా బిజెపికి లొంగిపోగా, తాజాగా టిడిపి, జనసేన.. బిజెపితో జతకట్టి పాలన చేస్తున్నాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్న మాటలు తప్ప చేతల్లో కనిపించలేదు. మరోవైపు మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం వికసిత్ భారత్ పేరిట జనాన్ని ఆశల పల్లకిలోకి నెడుతోంది. అందుకు తగ్గట్టు ప్రభుత్వం తరపున కేటాయింపులు ఉంటాయా? అందులో జిల్లా అందిస్తున్న సహకారం ఎంత? అన్నదానిపై ఆద్యంతం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. వీటన్నింటికీ మించి రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన జిల్లాగా గుర్తించి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గతంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర సాయం అందేది. యాక్సలరేటెడ్ ఇరిగేటెడ్ బెన్ఫిట్ ప్రాజెక్టు స్కీమ్ (ఎఐబిపి) తోటపల్లి ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వందల రూ.కోట్లు మంజూరయ్యేవి. అందువల్లే ఆ ప్రాజెక్టు పూర్తిదశ వరకు వచ్చింది. బిజెపి అధికారంలోకి వచ్చాక ఎఐబిపి గ్రాంట్‌ను పూర్తిగా రద్దు చేసింది. ఇప్పటి వరకు తోటపల్లి ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా సాయం అందలేదంటే అతిశయోక్తి కాదు. ఏకంగా కేంద్ర ప్రభుత్వం సాయమందించే ప్రాజెక్టుల జాబితా నుంచే తొలగించారు. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ పథకం ద్వారా పిల్లకాలువలు తవ్వకానికి, నీటి సంఘాల ఏర్పాటు, సంఘాల భవన నిర్మాణాలు, వాటిలో మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధుల్లో కేంద్రం 50శాతం భరించాల్సివుంది. రామతీర్థసాగర్ ప్రాజెక్టు విషయంలో పిఎంకెఎస్‌వై ప్రధాన మంత్రి కృషి సంచయ యోజన పథకం ద్వారా నాబార్డు నుంచి రుణం తీసుకోవాలంటూ ఉచిత సలహాలిస్తోంది. ఈ బాధ్యత నేరుగా కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాల్సి వున్నప్పటికీ బడ్జెట్ కేటాయింపు పద్దుల్లో ఆ లెక్కలు చూపుతారో లేదో వేచి చూడాల్సిందే.

విజయనగరం రైల్వే జంక్షన్ ఉత్తరాంధ్రకే తలమానికంగా ఉంది. ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒడిశాలోని రాయగడ మీదుగా విజయనగరానికి రైల్వే కనెక్టవిటీ ఉంది. ఇదే జంక్షన్ ఇటు ఆమదాలవలస, పలాస మీదుగా ఒడిశా రాజధాని భువనేశ్వర్ మీదుగా పశ్చిమబెంగాల్ కోల్‌కత్తా వంటి ఎన్నో మహానగరాలను కలుపుతుంది. అందుకు తగ్గట్టే ఇక్కడ ప్రయాణికుల తాకిడి ఉంటోంది. ఇంతటి ప్రాధాన్యతగల విజయనగరం రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. ముఖ్యంగా పట్టాలకు ఒకవైపే స్టేషన్ ఉండడం వల్ల రైళ్లు వచ్చి వెళ్లే సమయాల్లో ఎక్కువ రద్దీ ఉంటోంది. దీన్ని దృష్టిలో వుంచుకుని పట్టాలకు పడమర దిక్కున కూడా స్టేషన్‌ను విస్తరించాలని, అందుకనుగుణంగా ఫుట్‌పాత్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, భవనాలు నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ బిజెపి అధికారంలోకి వచ్చాక వాటి జోలికి వెళ్లడం లేదు. శ్రీకాకుళం జిల్లా గుణుపూర్ నుంచి మన జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాచిపెంట మీదుగా అరకు వెళ్లే రైలు రోడ్డు వేయాలని, తద్వారా గిరిజన గ్రామాలకు సైతం రైలు ప్రయాణ సదుపాయం కల్పించాలనే ప్రతిపాదన ఉంది. మరోవైపు విజయవాడ, రాజమండ్రి నుంచి వచ్చే రైళ్లు నర్సీపట్నం నుంచి రాజాం మీదుగా శ్రీకాకుళం జిల్లా కేంద్రాన్ని కలుపుతూ మరో ప్రతిపాదన ఉంది.

జిల్లాలోని గిరిజన వర్సిటీకి తగినన్ని నిదులు మంజూరు చేయడం లేదు. దీంతో, నిర్మాణ పనులు, నిర్వహణ నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రం ఆధ్వర్యాన నడిచే జవహర్‌లాల్ నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయాల నిర్వహణ, సదుపాయాలకూ తగిన నిధులు కేటాయించలేదు. ఖాళీపోస్టుల భర్తీకి చర్యలు లేవు. ఈ విధంగా ఈ విద్యాలయాల్లో నాణ్యమైన విద్య తగ్గేందుకు కేంద్రమే పరోక్షంగా కారణమౌతోంది. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యారోగ్యానికి పెట్టే ఖర్చుకూడా గడిచిన పదేళ్లగా తగ్గుతూ వస్తోంది. ఈనేపథ్యంలో జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏమేరకు నిధులు కేటాయిస్తుందో వేచి చూడాల్సిందే.

ఆకలి మంటల్లో గిరిజన కుటుంబం

- బదిలీల క్రీడలో బలిపశువైన పంచాయతీ కార్యదర్శి
- 4 నెలలుగా జీతం బిల్లు పెట్టని ఎంపిడిఒ
- జిల్లా అధికారుల ఆదేశాలూ బేఖాతరు
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా కనికరించని వైనం

ప్రజాశక్తి-పార్వతీపురం

మన్యం జిల్లాలో ఓ గిరిజన పంచాయతీ కార్యదర్శి కుటుంబం నాలుగు నెలలు గా పస్తులు ఉంటోంది. గిరిజన ఎమ్మెల్యే నియోజకవర్గంలో గిరిజన యువతికి అన్యాయం జరుగుతోంది. కొద్ది నెలల క్రితం జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శి మండంగి బాలా కుమారికి వీరఘట్టం మండలంలోని చిన్నగోర కాలనీకి మండంగి బాలా కుమారికి బదిలీ అయింది. రివైజ్డ్ బదిలీల్లో భాగంగా ఆమెను ఇక్కడికి బదిలీ చేశారు. అంతవరకు అక్కడ పని చేసిన పంచాయతీ కార్యదర్శి కె.సునీల్ కుమార్‌కు వంగర మండలం బదిలీ అయింది. చిన్నగోర కాలనీ పంచాయతీలో మూడు రోజుల పాటు బాలా కుమారి విధులు నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ క్రీడలో బాలా కుమారిని బలిపశువు చేశారు. మూడు రోజుల తర్వాత వంగర మండలంలో చేరిన సునీల్ కుమార్ మళ్లీ చిన్న గోర కాలనీ పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరారు. అప్పటికే విధులు నిర్వహిస్తున్న బాలా కుమారి ని కాదని బదిలీ అయిన సునీల్ కుమార్‌ను ఎంపిడిఒ విధుల్లో చేర్చుకున్నారు. బాలా కుమారికి మండలంలో వేరొక పంచాయతీకి బదిలీ చేయాల్సి ఉండగా నాలుగు నెలలుగా గాలిలో వుంచారు. ఆమెకు జీతం బిల్లు పెట్టడం లేదు. సునీల్ కుమార్‌కు మాత్రం జీతం బిల్లు పెడుతూ బాలా కుమారికి పస్తులు ఉంచుతున్నారు. రాజకీయ బదిలీల క్రీడలో బలిపశువయిన బాలా కుమారి తన జీతం బిల్లు పెట్టాలని సంబంధిత జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, పంచాయతీ జిల్లా అధికారి, ఎంపిడిఒ బేఖాతరు చేస్తున్నారు.

ఎమ్మెల్యే సిఫార్సు చేసినా..

బాలా కుమారిని పంచాయతీ కార్యదర్శిగా పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ సిఫార్సుతో చిన్న గోర కాలనీ పంచాయతీకి బదిలీ చేశారు. తర్వాత స్థానిక ఎంపిపి ఒత్తిడితో బదిలీ అయిన సునీల్ కుమార్‌ను అక్కడే చేర్చుకున్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని బాలా కుమారి ఎమ్మెల్యే జయకృష్ణ దష్టికి కూడా తీసుకెళ్ళారు. ఆయన కూడా బాలా కుమారిని రివైజ్డ్ బదిలీల్లో కేటాయించిన పంచాయతీలో వుంచాలని చెప్పారు. అయినా ఎంపిడిఒ బేఖాతరు చేశారు. ఎంపిపి వెంకటరమణ ఒత్తిడికి తలొగ్గి గిరిజన పంచాయతీ కార్యదర్శి బాలా కుమారి కి అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

పస్తుల్లో బాలా కుమారి కుటుంబం

పంచాయతీ కార్యదర్శి కుటుంబ సభ్యులు



పంచాయతీ కార్యదర్శి బాలా కుమారి 2019లో ఉద్యోగంలో చేరారు.ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త బిడ్డిక హరిబాబు నిరుద్యోగి. హరిబాబు తండ్రి కూడా వీరితో వుంటున్నారు. ఐదుగురి కుటుంబ సభ్యుల పోషణ బాధ్యతలు బాలా కుమారి పైనే వున్నాయి. ఇలాంటి బాలా కుమారి ని ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. వెంటనే ఆమె జీతం బిల్లు పెట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

రెండు రోజుల్లో సమస్య పరిష్కారం

డిపిఒ కొండలరావు

చిన్నగోర కాలనీ పంచాయతీ కార్యదర్శి బాలాకుమారి జీతం బిల్లు పెండింగ్ విషయం నా దృష్టికి వచ్చింది. మన్యం కలెక్టర్ శ్యాం ప్రసాద్ కూడా చెప్పారు. జీతం చెల్లించాలని ఎంపిడిఒని ఆదేశించాను. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.



పిహెచ్‌సి పరిసరాలను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

మందులు అందుబాటులో ఉంచుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని పిహెచ్‌సిల్లో రోగులకు అవసరమయ్యే మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ధోనుబాయి పిహెచ్‌సిని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో బయో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం సీతంపేటలోని పట్టుపురుగుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టుపురుగుల నుంచి దారం తీసే విధానాన్ని పరిశీలించారు. పట్టు పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం, కార్మికులకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కారిగూడలోని పట్టుపరిశ్రమకు సంబంధించిన షెడ్డు పనులను పరిశీలించారు. అక్కడే ఉన్న మల్బరీ తోట సాగును పరిశీలించారు. కార్యక్రమాల్లో సెరికల్చర్ ఏడీ సాల్మన్ రాజు, వైద్యాధికారి భాను ప్రతాప్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిన్న ఛార్జ్.. నేడు రిటైర్డ్

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పార్వతీపురం అదనపు ఎస్పీగా గురువారం బాధ్యతలు తీసుకున్న నాగేశ్వరి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. జిల్లాలో కేవలం 24 గంటలు మాత్రమే అదనపు ఏఎస్పీగా విధులు నిర్వహించారు. 1989లో తొలిసారి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆమె ఉద్యోగోన్నతులు పొందుతూ ఎఎస్పీ స్థాయికి ఎదిగారు. తన తండ్రి పార్వతీపురంలోనే పోలీసు అధికారిగా పనిచేశారని, దీంతో తన విద్యాభ్యాసం ఇక్కడే జరిగిందని గుర్తుచేసుకున్నారు. చిన్నప్పుడు చదువుకున్న చోట రిటైరవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి, ఎన్నో సమస్యలను ఎదురొడ్డి, కష్ట నష్టాలు ఓర్చి ఆరోగ్యంగా, ఆనందంగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందటం అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్‌పి రాంబాబు, ఎస్బీ సిఐ రంగనాథం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు డిసిఆర్బి సిఐ రమేష్, ఆదామ్, ఎఆర్ ఆర్ఐ నాయుడు, రాంబాబు, శ్రీనివాస రావు, పదవీ విరమణ పొందిన అదనపు ఎస్పీ కుటుంబ సభ్యులు, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పీకర్ ప్రకటన వెనక్కి తీసుకోవాలి

- 1/70 చట్టం రక్షణ పోరాటానికి సిద్ధం కండి
- ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టూరిజం అభివృద్ధి పేరిట 1/70 చట్ట సవరణ చేయాలని స్పీకర్ ప్రకటించడం ఆదివాసీల హక్కులు, చట్టాలకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉందని, కావున స్పీకర్ తన ప్రకటన వెనక్కు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుల మండంగి రమణ డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్‌కెపాడులో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టం సవరణ చేస్తే ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతంలో బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ కంపెనీలు ఆదివాసీ సంపదలైన సహజవనరులు, అడవులు, ఖనిజాలు, ప్రకృతి అందాలు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తాయని ఆదివాసీల జీవన విధానం ధ్వంసం అవుతుందనిఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047ను దృష్టిలో ఉంచుకుని షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం సవరణ చేయాలని ఇటీవలి జరిగిన దవోస్ సదస్సులో అంగీకరించి నట్లు కనిపిస్తుందని అన్నారు. 1/70 చట్టం అమలులో ఉండగా అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, జిరుగుమిల్లి, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో బినామీ పేర్లతో లాడ్జీలు, షాపింగ్ కాంప్లెక్స్, రిసార్ట్స్ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని అన్నారు. 2000 లో టిడిపి విధానం విజన్ 2020 పేరుతో 1/70 చట్టాన్ని సవరించి బాక్సైట్ ఖనిజాన్ని దోచుకోవడానికి కుట్ర, నేడు విజన్ 2047 పేరుతో 1/70 చట్టం సవరణకు పూనుకుని టూరిజం అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరులను దోచుకోవడానికి కుట్ర చేస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు. 1/70 చట్టం జోలి కోస్తే కూటమి ప్రభుత్వానికి ఆదివాసీలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ 1/70 చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వ స్పీకర్ ప్రకటన అతని వ్యక్తిగతమా, టిడిపి విధానమా ఆదివాసీ ప్రజలకు సమాధానం చెప్పాలని రమణ డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలు 1/70 చట్ట రక్షణకు పోరాటాన్ని సిద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : నిరసన తెలుపుతున్న గిరిజనులు



పాచిపెంట : నిరసన తెలుపుతున్న గిరిజనులు

పాచిపెంట : అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, నాయకులు సూక్రు అప్పలస్వామి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ గాంధీ బొమ్మ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని, దీనివల్ల ఎటువంటి ఉపయోగం లేదని మాట్లాడటం సరైందని కాదని అన్నారు. వెంటనే స్పీకర తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 1/70, పీసా చట్టాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. జిఒ 3ను పునరుద్ధరించి, గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాల పట్ల ఎటువంటి అవగాహన లేకుండా స్పీకర్ మాట్లాడం సరైంది కాదన్నారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించి కార్పొరేట్లకు అటవీ సంపదను దోచిపెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలో భాగంగా ఇలా మాట్లాడారన్నారు. గిరిజన హక్కులను కాలరాస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్ర కళ్యాణ్, పోతయ్య, ఆటో కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు బి.గౌర్నాయుడు, సిఐటియు నాయకులు చింత పోలిరాజు, కోరాడ ఈశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఉపాధిహామీ చట్టంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ శుక్రవారం నిరసన తెలిపారు. జీతం స్లాట్‌లో అప్లోడ్ చేయలేదని స్థానిక ఎపిఒ కార్యాలయానికి తాళాలు వేస్తూ నిరసన తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పనిచేస్తున్నామని, అయినా అధికారులు తమసమస్యలను పట్టించుకోవడంలేదని అన్నారు. ఈ నిరసనలో రాజారావు మురళి మన్మధరావు వరప్రసాద్ చలపతిరావు, మండల పరిధిలో గల 78 మంది సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న పీడీ కనకదుర్గ

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని గంజాయి భద్ర పంచాయతీ పరిధిలోని దిగువ శెంబి అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకదుర్గ పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం శెంబి అంగన్వాడీ కేంద్రం నుంచి ఒడిశా పోలీసులు కొంత సామగ్రిని తీసుకెళ్లి పోయారు. దీంతో సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్ వైజర్లు అనూరాధ, లక్ష్మితో పాటు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి కూడా అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్లకు పలు సూచనలు చేశారు. గర్భిణి మహిళలు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందించాలని ఆదేశించారు. బాల్య వివాహాలు చట్టవ్యతిరేకమని, వాటిని ప్రోత్సహించ వద్దని గిరిజనులను కోరారు. వారి వెంట అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు శశికళ వున్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వసతి గృహ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. 16వ వార్డులో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. సిక్ రూమ్ తనిఖీ చేసి అక్కడ అనారోగ్య సమస్యతో ఉన్న విద్యార్థుల ఆరోగ్య స్థితి పరిశీలించారు. వారికి అందజేసిన చికిత్స, వైద్య పరీక్షల వివరాలపై వసతి గృహ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్‌లో మందులు తనిఖీ చేశారు. సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని వసతి గృహ హెల్త్ స్టాఫ్ ను ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ లో ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారు సంబంధిత వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీసి స్క్రీనింగ్ వివరాలు రికార్డులో పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్య సమస్యలున్నాయా అని అడిగారు. ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు లభ్యత తెలుసుకొని విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా సమిష్టి కృషి చేయాలన్నారు.విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.చిన్న మోహన్‌రాయుడు, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు,వైద్య సిబ్బంది నారాయణమ్మ,హాస్టల్ హెల్త్ స్టాఫ్ శ్రీరంజని,అనూష ,తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో ఏనుగుల బీభత్సం

- పెద మేరంగి కూడలిలో రైస్‌మిల్లులో చొరబడి తలుపులు, కిటికీలు ధ్వంసం
- 30 ధాన్యం బస్తాలు చిందరవందర
- ఇదే రైస్ మిల్లులో ఐదోసారి ధ్వంసం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదమేరంగి కూడలి సమీపాన గల శ్రీ సాయి గాయత్రి మినీ మోడరన్ రైస్ మిల్లులో గురువారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. మిల్లులోకి ప్రవేశించి కిటికీలు, తలుపులు ధ్వంసం చేసి మిల్లు ఆడించి తినడానికి ఉంచిన బియ్యాన్ని, ఆడించడానికి ఉంచిన 30బస్తాల ధాన్యాన్ని ఏనుగులు కావాల్సినన్ని తిని, మిగిలిన ధాన్యాన్ని చిందరవందర చేసి వెళ్లిపోయాయి. శుక్రవారం తెల్లవారి మిల్లు యజమాని అక్కడకు వెళ్లి పరిస్థితిని చూసి ఏమైందో తెలియక నిర్ఘాంతపోయాడు. అనంతరం తేరుకొని ఇది ఏనుగుల పనేనని గ్రహించి లబోదిబోమన్నాడు. అయితే ఏనుగుల వల్ల ఇలా జరగడం ఇది ఐదో సారి కావడం గమనార్హం. ఇలా జరగడడం వల్ల ప్రతిసారీ కనీసం రూ.50వేలు వరకు నష్టం సంభవిస్తూ వస్తుందని యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏనుగుల కదలికలపై పరిశీలనల చేయాల్సిన అటవీ శాఖ సిబ్బంది పగలు మాత్రమే గమనించి రాత్రి వేళల్లో అసలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిఇలా ఉంటే ఆ రైస్ మిల్లు పక్కనే జనావాసం నివసించే కాలనీ ఉందని, జరగరానిది ఏమైనా జరిగితే దీనికి బాధ్యులు ఎవరని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఏనుగులు తరలిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇంకెప్పుడు తరలిస్తారోనని దుయ్యబడుతున్నారు. ఇకనైనా అధికారులు తన మిల్లు వద్ద జరిగిన నష్టాన్ని పరిశీలించి నష్టపరిహారాన్ని ఇప్పించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన రైతు మిల్లులో ధాన్యం బస్తాలు

పట్టా లేకుండా ఇల్లు కడితే ఉపేక్షించం

- ఇంటింటా సమగ్ర సర్వే
- ఆక్రమణదారులకు ఫారం 7, 6 నోటీసులు : తహశీల్దార్
- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాలు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీం అన్నారు. ప్రజాశక్తిలో శుక్రవారం ప్రచురితమైన 'దబ్బగెడ్డలో ఆక్రమణలు' అన్న వార్తకు ఆయన స్పందించారు. ఈ మేరకు స్తూ గ్రామాన్ని సందర్శించారు. బిసి కాలనీలో మట్టి పోగులు వేసిన స్థలాలను పరిశీలించారు. అలాగే అక్రమంగా ఇల్లు కట్టుకుంటున్న వారిని కూడా ప్రశ్నించారు. సొంత ఇల్లు ఉండి కూడా అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదన్నారు. స్థానిక విఆర్ఒ, సర్వేర్ అసిస్టెంట్‌కు ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా మీకు ఇబ్బందులు కలిగిస్తే నేరుగా తానే వచ్చి సర్వేలో పాల్గొంటానని తెలిపారు. ఇంటి స్థలాల క్రయ విక్రయాలకు తావులేదని, అలాంటి వాటిని కూడా గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ భవన నిర్మాణాలకు సూచించిన ప్రాంతాల్లో ఆక్రమణలను వెంటనే తొలగిస్తామన్నారు. అలాగే ఇల్లు నిర్మిస్తున్న వ్యక్తి వద్దకు వెళ్లి పట్టాలు తీసుకుని తమకు చూపించాలని, ఇంటి నిర్మాణం వెంటనే ఆపాలని ఆదేశించారు. ఆక్రమణదారులకు అవసరాన్ని బట్టి ఫారం 7,6 నోటీసులు ఇస్తామన్నారు. దౌర్జన్యంగా ఎవరైనా ముందుకెళ్తే వారిపై కేసులు తప్పవని, విచారణలో అక్రమ నిర్మాణాలని తెలిస్తే వాటిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది ఇచ్చే సర్వే నివేదికల ఆధారంగా గురు, శుక్రవారాల్లో మళ్లీ గ్రామంలో ఇంటింటి సర్వే చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒ, సర్వేయర్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహశీల్దార్ ఇబ్రహీం

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలికి చెందిన బొంగి ప్రవీణ్ కుమారుడు గణపతిరావు నిమోనియా వ్యాధితో బాధపడడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దృష్టికి తీసుకువెళ్లడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం నిధికి విరవించగా, అక్కడ నుంచి రూ.3 లక్షల చెక్కును మంజూరైంది. దీన్ని ఎమ్మెల్యే వారికి అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాలనాయుడు, యోగిరెడ్డి భాస్కరనాయుడు, చినబోగిలి బూత్ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎం.శంకరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని లిడికివలసలో పాఠశాల యథావిధిగా ఉంచాలని గిరిజన సంఘం నాయకులు తాడంగి సాయిబాబు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాము నివసిస్తున్న లిడికివలసలోని ప్రాథమిక పాఠశాలను తరలిస్తున్నట్లు విద్యాధికారులు తెలిపారని,కనుక యథావిధిగా కొనసాగించాలని తెలిపారు. గోచెక్క పాఠశాలలో విలీనం చేస్తే గిరిజన విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమై డ్రాపౌట్ అవుతారని, కనుక తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఈ విషయమై విద్యాశాఖ అధికారులతో మాట్లాడతానని, సాధ్యాసాధ్యాలు తెలుసుకొని సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.



గర్భిణులకు ఆహార కిట్లు అందజేస్తున్న సిడిపిఒ, సూపర్‌వైజర్లు

అమ్మకు అమృత ఆహారం కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రభుత్వం మంజూరు చేసిన అమ్మకు అమృత ఆహారం కిట్లను శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ బివిజె పాత్రో గర్భిణీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత ఆహారం ఆవశ్యకతను గర్భిణులకు వివరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిడిపిఒ బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలో రక్తహీనత నివారణలో భాగంగా అమ్మకు అమృత ఆహారం అనే పేరుతో పోషకాహార కిట్లను మండలంలో హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న 101 మంది గర్భిణీలకు మంజూరు చేశామని, వాటిని సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తల ఎంపిడిఒ ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే వారి అవశ్యత తెలియజేసి గర్భిణీలు ఏ విధంగా తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపండు, జీడిపిక్కలు కొనాలి

ప్రజాశక్తి - పాచిపెంట

వన్ దన్ వికాస కేంద్రాల ద్వారా చింతపండు జీడి పిక్కలు కొనుగోలు చేయాలని డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిసిలు, విఒఎలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మండలంలో గల 7 వన్‌దన్ వికాస కేంద్రాల ద్వారా అటవీ ఫలసాయాలైన చింతపండు, జీడి పిక్కలు కొనుగోలు చేసి వన్‌దన్ వికాస్ కేంద్రాలను బలోపేతం చేయాలని అన్నారు. అలాగే కొత్త అప్పులు మంజూరు చేసి వసూళు కూడా వంద శాతం ఉండాలని, వచ్చేనెల 10 తేదీలోగా పూర్తిస్థాయిలో అప్పులు కట్టించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం శివుని నాయుడు, డిపిఎం అప్పారావు, సిసిలు పాల్గొన్నారు.

జంఝావతిని పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంఝావతి రిజర్వాయర్‌పై కూటమి నాయకులు సమావేశంలో చెప్పేలా పూర్తి చేసేందుకు ముందుకు రావాలన్నారు. జంఝావతి సాధన కమిటీ వేసేలా కూటమి నాయకులు చర్యలు తీసుకోవాలని కోరగా, అందుకు నాయకులు ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లని పరిస్థితి ఉందని అన్నారు. సాధన కమిటీ వేయని పరిస్థితి ఉందని కాబట్టి వెంటనే కూటమి ప్రభుత్వంలో గల నాయకులు జంఝావతి రిజర్వాయర్ పనులు అటు ఒడిశాతో సంప్రదింపులు జరిపి వేగవంతంగా పెండింగ్ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ రమణమ్మ

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహశీల్దార్ ఎం.రవణమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు, తాగునీటి సదుపాయాలను క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు వెళ్లిన ఐటిఐ విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక భద్రగిరి ఆర్ ఐటిఐలో చదువుతున్న ఎలక్ట్రీషియన్ విద్యార్థులు ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి నెల్లూరులో గల సోమ ఇనిస్టిట్యూట్‌కు ఆన్ జాబ్ శిక్షణ నిమిత్తం పంపించినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. వెల్డర్ విద్యార్థులను హైదరాబాద్ జడ్చర్లలో ఎల్అండ్‌టి కంపెనీకి పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు పైశిక్షణ ద్వారా మరింత నైపుణ్యం పెంపొందించుకోవాలని, ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరారు.

సూర్యవైభవ వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్యపీఠంలోని సౌరయాగశాలలో రథసప్తమిని పురస్కరించుకొని మాఘహేలా శ్రీసూర్య వైభవాల కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమకోటి నరహరి శాస్త్రి ఫిబ్రరి 3న సహస్ర కలశాభిషేకం, ద్వాదశాదిత్య, విశ్వశాంతి హెూమాదులు, 4న రథసప్తమి సందర్భంగా సూర్యభగవానుని కళ్యాణోత్సవం, సహస్ర దీపాలంకార, ఊంజల్, పూలంగి సేవలు, సత్యసాయి సేవా సమితి, వికాస తరంగిణి సభ్యులచే సామూహిక స్తోత్ర పారాయణలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 52 ఆదివారాలు సంవత్సర సౌర దీక్షాంత పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పి.వెంకటనాయుడు, డి.వెంకట నాయుడు, బి.జయబాబు, కెమల్లిబాబు, వేదాంత కళాశాల డైరక్టర్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సూర్యపీఠం ప్రతినిధులు



కురుపాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

ఉపాధి కూలీలకు అస్వస్థత

ప్రజాశక్తి - కురుపాం

అడవిలో దొరికే పులిదుంపలు తిని ముగ్గురు ఉపాధి కూలీలు అస్వస్థకు గురైన సంఘటన మండలంలోని రస్తాకుంటుబాయిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన ఆరిక చరణ్ (20), ఫీల్డ్ అసిస్టెంట్ ఆరిక మాధవరావు (38), ఆరిక ప్రవీణ్ (28) ఉపాధి హామీ పనులకు వెళ్లగా అక్కడ దొరికే పులి దుంపలు కాల్చుకొని తిని అస్వస్థకు గురయ్యారు. స్థానికులు వెంటనే వారిని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యాధికారి కె.సందీప్ కుమార్ చికిత్స అందిస్తున్నారు. ఎపిఒ పి.బావాజీ ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నానని, ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎటువంటి ప్రాణాపాయస్థితి లేదని, ఫీల్డ్ అసిస్టెంట్‌ను డిశ్చార్జ్ చేయగా మరో ఇద్దర్ని అబ్జర్వేషన్‌లో ఉంచారని తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణయించిన సమయం, కొలతలు ప్రకారం ఉపాధి కూలీలు పని చేస్తేనే కూలి గిట్టుబాటు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు రావాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మస్తర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

మక్కువ : ఉపాధి హామీ పనులు ప్రారంభమైన తర్వాత శుక్రవారం స్థానిక ఎంపిడిఒ డిడి స్వరూపరాణి కవిరిపల్లిలో మస్తర్లు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మికుల బంధలో 60 మంది కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో పనులు మొదలు పెట్టామన్నారు. ఇప్పటి వరకు మండలం మొత్తం హాజరైన వేతన దారులు 3254 మంది పనిచేస్తున్నారని ఎపిఒ ఈశ్వరమ్మ తెలిపారు. భూ అభివృద్ధి, ఫారం పాండ్స్, ట్రెంచ్ వర్కులు, కాలువలు, ట్యాంక్ వర్క్స్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

పైడిమారమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

సుమారు రూ.40లక్షల ప్రతిపాదనలతో నిర్మిస్తున్న పైడి మారమ్మ ఆలయం నిర్మాణానికి శుక్రవారం కురుపాం గ్రామ పెద్దలు, ప్రజలు భూమి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తామన్నారు. కురుపాంకు చెందిన ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సకాలంలో అవకాశం ఉన్నంతలో మెండుగా విరాళాలు అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బూరుబు నారాయణరావు, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల రాజకీయ వేధింపులు మానుకోవాలని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్ స్కూల్ మధ్యాహ్న భోజన కార్మికుల వంటలను పరిశీలించిన అనంతరం సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు దుగ్గివలస ప్రదీప్ కుమార్, స్థానికులు రాంబాబు, పిన్నింటి సాయికుమార్, వెంపటాపు శ్రీను విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులను వివిధ కారణాలు చూపిస్తూ ఎలాగైనా తొలగించాలని రాజకీయ ఒత్తిళ్లు చేస్తున్నారని, ఎన్నో కష్టాలు పడి వంటలు చేస్తూ వేడివేడి భోజనాన్ని పిల్లలకి అందిస్తూ సేవలందిస్తున్న వారిని తొలగించేందుకు ప్రయత్నించడం సరైంది కాదని అన్నారు. ఉన్నతాధికారుల పరిశీలనలో భోజనాలు బాగున్నాయని నివేదికలు అందించినా రాజకీయంగా కక్ష సాధింపు చర్యలు చేపట్టి ఎలాగైనా తొలగించేందుకు ప్రయత్నిం చడం మంచిది కాదని విమర్శిం చారు. హైస్కూల్లో గల పిల్లలందరికీ ఏడుగురు మధ్యాహ్న భోజన కార్మికులు సేవలందిస్తున్నా రని, వీరు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతూ వచ్చిన తక్కువ వేతనాలతో బతుకీడుస్తున్నారని, జిల్లావ్యాప్తంగా రాజకీయ వేధింపులకు పాల్పడుతున్న పరిస్థితి ఉందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను అకారణంగా తొలగించేందుకు ప్రయత్నిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో శుక్రవారం స్థానిక ఎస్సై పి.నారాయణరావు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేనిటువంటి వాహనదారులకు అపరాధరుసుం వేసి ఇంతవరకు జరిమానా కట్టినటువంటి వాహనాదారులకు వెంటనే కట్టించారు. అనంతరం జాతీయ పౌరుని హక్కులు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రజలకు పౌరుని హక్కులు, విధులు, బాధ్యతలు గుర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలు పట్ల ఎఎస్ఐ ఎల్ శ్రీనివాసరావు అవగాహన సదస్సు కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని, రాంగ్ కాల్ వస్తే వాటిని పోలీస్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని, ప్రతి వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పద్మ, సుజాత, తిరుపతిరావు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్థానిక ఎస్ఐ పి.రమేష్ నాయుడు గరుగుబిల్లిలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు సివిల్ రైట్స్‌పై అవగాహన కల్పించారు. రాజ్యాంగంలో పౌర హక్కులనేవి చట్టాల ద్వారా స్థాపించబడిన హక్కుల సముదాయమని పేర్కొన్నారు. హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని అన్నారు. పౌర హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు అనేకమైన ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ఉన్నాయని అన్నారు.

భాస్కరరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - సీతంపేట

ప్రధానోపాధ్యాయులు మీనక భాస్కరరావు సేవలు మరువలేనివని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలో పెద్దపొల్ల బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భాస్కర రావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఎంగా ఉద్యోగోన్నతి వచ్చి అక్కడే జాయిన్ అయ్యి అక్కడే రిటైర్మెంట్ అవడం గొప్ప విషయమని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన పిల్లలకు ఎంతో సేవలందించారని కొనియాడారు. భాస్కరరావు కమిట్‌మెంట్‌లో పని చేస్తారని న్నారు. నిగర్వి అని కొనియాడారు. గిరిజన సంక్షేమశాఖ డిడి అన్నదొర మాట్లాడుతూ పెద్దపోల్లలో సుమారు ఐదేళ్లుగా హెచ్ఎంగా మారుమూల ప్రాంతం లో బాగా పనిచేయడం గొప్ప విషయమని చెప్పారు. ఏ పని ఇచ్చినా బాధ్యతగా పనిచేస్తారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, ఎపిఒ చినబాబు, పార్వతీపురం గిరిజన సంక్షేమశాఖ డిడి కృష్ణవేణి, ఎటిడబ్ల్యుఒ, మంగవేణి, డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్న కుమార్ ప్రధానోపాధ్యాయులు ఎ.భాస్కర్ రావు, పి నారయుడు సుకుమార్ మూటక రవి ఉపాధ్యాయులు పి ధర్మారావు పాల్గొన్నారు.



సన్మాన సభలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్ అమల్లో ఉన్నందున శుక్రవారం మండలంలోని నడుకూరులో సచివాలయ కార్యదర్శి ఎన్.కోటేశ్వరరావు, సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారు. అలాగే గ్రామంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ముసుగు తొడిగి, గ్రామంలో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు.

ఉత్తమ బిఎల్ఒకు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జాతీయ ఓటర్స్ డే -2025 సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బిఎల్ఒగా అవార్డు తీసుకున్న ఇరిడి సచివాలయం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రాజాన విజయలక్ష్మిని తోటి సంక్షేమ, విద్యా సహాయకులు, ఉద్యోగులు సన్మానించారు. విజయలక్ష్మి సేవలు తమకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

మలుపుల వద్ద జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకర మలుపుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన ఉండాలని జిల్లా రవాణా శాఖాధికారి ఎ.వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. ప్రమాదకర మలుపుల వద్ద ద్విచక్ర, నాలుగు చక్రాల, భారీ, అతిభారీ వాహనాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని కూనేరు - రామ భద్రపురం రోడ్డులో మరిపివలస, ఆర్తాం, కోటిపాం 2, గంగరేగివలస, గుమడ, కొమరాడ వద్ద గల 7వ ప్రమాదకర మలుపు వద్ద సహాయ ఇంధన శకట తనిఖీదారు, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే కురుపాం మండలం తోటపల్లి -గుణుపురం రోడ్డులో జట్టు ఆశ్రమం దగ్గర గిజబ - పూతికవలస దగ్గర మూడో ప్రమాదకర మలుపు వద్ద సహాయ ఇంధన శకట తనిఖీదారు, పోలీస్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ ఇంధన శకట తనిఖీదారు జి.సత్య నారాయణ, కురుపాం, గరుగుబిల్లి, కొమరాడ, సీతానగరం ఎస్ఐలు నారాయణ, రమేష్ నాయుడు,నీలకంఠం, రాజేష్ కుమార్, ఆర్ అండ్ బి ఏఈఈలు రాజేందర్ కుమార్, రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కురుపాం

ఎన్నో ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వాలకు, ఎంతోమంది అధికారులకు తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని వినతులు అందించి విసిగిచెంది తమ గ్రామానికి ఉన్న మట్టి రహదారికి ప్రతి ఏటా మరమ్మతులు చేపట్టుకుంటున్న సంఘటన మండలంలో మరిపల్లి పంచాయితీ గొల్లగానిగూడ గిరిజన గ్రామంలో చోటు చేసుకుంది. ప్రతి సంవత్సరం లాగే శుక్రవారం కూడా పాడైన మట్టి రోడ్డుకు గ్రామస్తులు పలుగు, పార పట్టి స్వచ్ఛందంగా గుంతల కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజనులు, టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామం నుంచి ఎటువంటి అవసరాలకైనా నిత్యవసర సరుకుల కోసం, అనారోగ్యానికి గురైనప్పుడు ఈ మట్టి రహదారి వెంట వెళ్లడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అనారోగ్యమైతే డోలీ ద్వారా మోసుకెళ్లాల్సిన వస్తుందని, కావున కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తమ గ్రామానికి బిటి రహదారి సౌకర్యం కల్పించి ప్రయాణ మార్గం సులభతరం చేయాలని కోరుతున్నారు.



శ్రమదానంతో స్వచ్ఛందంగా రోడ్డు పనులు చేసుకుంటున్న గొల్లగానిగూడుకు చెందిన గిరిజనులు

ప్రజలను బెంబేలెత్తిస్తున్న కుక్కలు

లేగ దూడను పీక్కుతిన్న వైనం

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పశువులు, మేక, గొర్రెల పిల్లలను లక్ష్యంగా చేసుకొని కుక్కలు గుంపులు దాడులకు తెగబడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందు తున్నారు. గురువారం వేకువజామున మండలంలోని దబ్బగెడ్డలో జరిగిన ఘటన పలువురు హృదయాలను కలచివేసింది. రౌతు హరి సాయి రామకృష్ణకు చెందిన ఆవు గురువారం వేకువజామున ఈనింది. తన ఆవు ఈత సమయం వచ్చే సూచన లేకపోవడంతో రైతు యధావిధిగా ఆరు బయట శాలలోనే ఆవును కట్టేశాడు. గురువారం వేకువజామునే ఎవరూ లేని సమయంలో ఆవు మగదూడకు జన్మనిచ్చింది. దీంతో అదే పనిగా కాసుకుంటున్న కుక్కల గుంపు తల్లి కడుపు నుండి బయట పడగానే దూడపై కుక్కల గుంపు దాడి చేసి ఆరు బయటకు ఈడ్చుకుపోయి పీక్కు తిన్న ఘటన చూపర్లను కలచివేసింది. ఇటీవల పలు ఘటనలు మండలంలో చోటు చేసుకుంటున్నాయి. వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరగడంతో వాటి ఆహారం కోసం ఇలాంటి దాడులు చేస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గల కుక్కలను నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - బలిజిపేట

కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్ని మానసిక ఒత్తిడి గురి చేయడం వల్ల వారు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న విద్యాసంస్థలను సీజ్ చేసి, యాజమాన్యపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు భీమరాజు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టేలు పందేలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో గొర్రె పందాల శిబిరాలపై పోలీసులు దాడులు చేసినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. మండలంలోని దలైపేట గ్రామ శివారులో పొట్టేలు(గొర్రె పోతు) పందేలు నిర్వహిస్తున్నారని జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు వచ్చిన సమాచారం దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో 11 మందిని పట్టుకొని వారి నుంచి ఒక పొట్టేలు రూ.7,760 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఉరిడి, గుంజరాడలో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉరిడి, గుంజరాడలో శుక్రవారం పశువైద్యాధికారి కె. శైలజ పశు ఆరోగ్య వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాడి రైతులకు పశువులు, జీవాలకు సోకే వ్యాధులు, గర్భకోశ వ్యాధులు, చూడి నివారణకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం అవసరమైన వాటికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లక్కయి, కూటమి నాయకులు, వెటర్నరీ వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలో పనుకువలసలో పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి ఎస్.మన్మధరావు, ఎడి వై.సింహాచలం మాట్లాడుతూ ఇలాంటి పశు వైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. 28 దూడలకు నట్టలు వేశామని, 13 ఆవులకు గర్భ కోస వ్యాధి చికిత్సలు చేశామని తెలిపారు. 45ఆవులకు చికిత్స అందించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సత్య ప్రకాష్, ఎడి శ్రీనివాసరావు, ధోనుబాయి వైద్యాధికారి శంకర్రావు, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

9677 మందికి పించన్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వితంతు, వికలాగులు, కల్లుగీత, చేనేత, డప్పు, ఒంటరి మహిళలు, వృద్ధాప్య, కేన్సర్, బెడ్ రెస్ట్, తదితర రకాలైన 9677 మందికి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఇన్చార్జి ఎంపిడిఒ డి.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పింఛనుదారుడు ఇంటికి అధికారులు వచ్చి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పాంచాలికి చెందిన పత్తి కాయల రాంబాబు విశాఖపట్నం కేజీహెచ్ లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పాంచాలికి చెందిన రాంబాబు మద్యానికి బానిసై మద్యం మత్తులో జనవరి 28న ఇంటికి ఉన్న గేటుకు తల గుద్దుకోవడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు సాలూరు, విజయనగరం నుండి విశాఖ కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య బంగారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.



మృతి చెందిన రాంబాబు